
# వంకర గీతలు

విహారి



**సో**మవారం ఉదయం... ఎనిమిది పదిహేను దిల్‌షుక్‌నగర్ బస్టాండు. జనం కిటకిట లాడుతున్నారు. కొన్ని వారాంతపు అలసట తీరని గ్లాని మొహాలు, కొన్ని వారారంభపు ఉత్సాహ విద్యుత్తు నింపుకున్న కళ్లూ, మరికొన్ని ఏరోజైనా, ఏ రాజైనా మా బతుకులింతే అన్న నిస్పృహ కళ్లూ, అన్నీ కలగలుపుగా బస్సు కోసం ఎదురుతెన్నులు చూస్తున్నాయి.

జీడిమెట్ల పోయే వీరా బస్ అప్పుడే వచ్చి ఆగింది. వందల కొద్దీ జనం ఎక్కడానికి ఎగబడ్డారు. నేనూ ముందు డోర్ నుంచి ప్రయత్నిస్తున్నాను. నా పక్కగా ఆమె సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే లోపలకి ఎక్కడానికి కుస్తీ పడుతోంది. 'బస్ ఎక్కుతున్నాను. ఐదు నిమిషాల తర్వాత చేయండి' మాట కట్ చేసింది.

నేను లోపలకి చేరాను. అనడం కంటే ఎవరో నన్ను లోపలకి చేర్చేరు అనడం సహజోక్తి అవుతుంది. సీనియర్ సిటిజన్స్ సీట్లో కూర్చున్నాను. నా పక్కసీట్లో ఉదుటున ఆమె కూలబడింది. జనం మధ్యగా...

'సారే జహా సే అచ్ఛా' ఫోన్ మోగింది.

'ఆ... ఏమిటీ?'

'.....' కొన్ని సెకన్లు విన్నది.

''మీరంటున్నట్లు ఇంట్లో వస్తువుల్ని ఎక్కడో అక్కడ తగలేసే అలవాటేం లేదు నాకు. చూడండి. మీర డిగే డ్రెస్ మీ బీరువాలోనే వుంటుంది. సరిగ్గా చూసుకోండి. కనిపిస్తుంది''

''...........''

'టిఫిన్ టేబుల్ మీద పడేసి పోలేదు. వండి సిద్ధం చేశాను. బ్రేక్‌ఫాస్ట్ చేసి వెళ్లండి'

''............''

''ఎందుకంత విసుగూ...చిరాకూ..రెక్కలు ముక్కలు చేసుకొని ఈ సంసార లంపటంలో ఛస్తుంటే ప్రతి క్షణం మీ మాటలతో వేధిస్తున్నారు. ఏమైందిప్పుడు?''

''............''

''రాత్రి సంగతా? ఆ విషయం మాట్లాడే సందర్భమేనా ఇది. నేను బస్సులో వున్నాను''

ఫోన్ ఆపేసింది ఆమె. సీట్లో సర్దుకు కూర్చుంది. కండక్టర్ వస్తే పాస్ అని చెప్పి బ్యాగ్‌లో నుంచి పాస్‌ని చూపించింది. నేను మైత్రీవనంకి టిక్కెట్ తీసుకొన్నాను.

నా వెనుక వరుసలో కిటికీ సీట్లో ఫోన్ మోగింది.

'మౌనంగానే ఎదగమనీ...' పాట డయల్ టోన్.

ఆమె మాట్లాడుతోంది. సన్నగా

వయొలిన్ మీది రాగంలా.

'ఈ వారం రాలేదేం. నిన్నల్లా కూడా ఫోన్ చేసి చేసీ విసుగొచ్చింది ఏమైంది?'

'..........'

'కార్డ్ అయిపోవడం ఒక వంక. నాకు తెలుసులెండి. నిన్నా మొన్నా పూరా ఆటలో కూర్చుండిపోయారు కదూ. టిన్నూగాడు 'డాడీ, డాడీ' అని ప్రాణం తీసేశాడు. శనివారం ఐమాక్స్ చూపించి సముదాయించాను. నిన్న మళ్లీ అదే వరస. మా బాధ మీకసలు అర్థం కాదా. ఏం. మనిషో ఏమిటో...'

'..........'

'ఈ కహానీలన్నీ మూడేళ్ల నుంచీ వింటూనే వున్నాగా... ఓ నెల సెలవు పెట్టి ఇక్కడకి రండి. సీరియస్‌గా ప్రయత్నిస్తే ట్రాన్స్‌ఫర్ కాకపోదు. అసలు మీకే ఇంట్రస్ట్ లేదు. మీ అలవాట్లూ, అవసరాలూ అక్కడే హాయిగా గడిచిపోతున్నాయిగా. ఇంక ట్రాన్స్‌ఫరెందుకు? మేమెందుకు?'' ఆలాపన అయిపోయి పల్లవి ఎత్తుకున్నట్లు ఆమె కంఠస్వరంలో మార్పు ద్యోతకమౌతోంది.

'.........'

''నేను ఏవేవో మాట్లాడుతున్నానా? చాల్లెండి మాటకి మాట నాకిష్టం లేదు. ఆఫీస్‌కి పోతున్నాను. ఏ ఏడుపెట్లా వున్నా కొలువు తప్పదుగా. సరే... సెలవుపెట్టి వచ్చేయండి... మాట్లాడుకుందాం'' చరణం పూర్తయినట్లుగా ఆపేసింది.

'.....' అటువైపు నుంచీ ఏదో విన్నది.

ఫోన్ ఆఫ్ చేసేసింది.

నాకు మనసులో ఏదో పరితాపం మొదలైంది. ఏవిటో పాపం.... ఈ పిల్ల పరిస్థితి. సమస్యని ఊహిస్తుంటే...దృశ్యాలు పరిపరివిధాలుగా కనపడుతున్నాయి. బొమ్మ, బొరుసూ కళ్ల ముందు కదలాడినాయి. అతని అలవాట్లు, అవసరాలూ గడిచిపోతున్నాయి అంటే అతనికి వేరే కథేమైనా వుందా? అది ఈమెకు తెలుసా? లేక మాటవరసకి 'అలవాట్లు' పదానికి 'అవసరాలు' జోడించిందా? సెల్ ఫోన్ చెప్పని వాస్తవం ఏమిటో?!

ఈ ఆలోచనలోనే నాకు కునుకు పట్టేసింది.

నా పక్కసీట్లో మళ్లీ ఫోన్ 'సారే..జ హాం సే అచ్ఛా' ఉలిక్కిపడి కళ్లు తెరిచి సర్దుకు కూర్చున్నాను. పక్కసీట్లో ఆమె ఫోన్ ఆన్ చేసింది.

''ఎందుకట్లా మాట్లాడుతున్నారు? ఏమైంది. మీకివాళ. జ్ఞానం, సంస్కారం అంటూ ఏమిటేమిటో అంటున్నారు'' పెద్దగానే మాట్లాడుతోంది ఆమె. అందరికీ స్పష్టంగా వినిపిస్తోంది.

అవతల మాటలకి సమాధానంగా, ''ఎందుకు సెలవు పెట్టాలండీ... ఎందుకు? ఇక్కడ ఆఫీసులోనేమో నన్ను కట్టుకుపోయినంత పనీ, బాధ్యతా. మీరేమో ఇదీ తంతు. పోనీ ఉద్యోగం మానేస్తానంటే మీ మటుకు మీరు ఏడుపులు, బుజ్జగింపులూ, మీ అమ్మేమో అడ్డమైన మాటలూ మాట్లాడడం...నన్నిట్టా కాల్చుకుతింటే ఎంతకని భరించేది''

'......'

''అవును..మీరంటున్నట్లు నాకేం మాయరోగం రాలేదు. మీ ఆరోగ్యమే పూర్తిగా దెబ్బతింది. అర్థమవుతూనే వుంది. అసలు ఇదెక్కడి వింతండీ స్వామీ. ఎవరికన్నా తెలిస్తే మొహాన్న ఉమ్మేస్తారు. ఇదొక్క ఇష్యూనా? సిగ్గూ, లజ్జా వుండక్కర్లా. పోనీ, నిన్నో మొన్నో పెళ్లయిన వాళ్లమా. ముగ్గురు పిల్లలు. పెద్దదానికి పన్నెండేళ్లు గుర్తుంచుకోండి.''

'......'

'హిట్టూ హిడెన్ ఎజెండా పెట్టుకొని చీటికీ మాటికీ. అయినదానికీ కాని దానికీ నిష్ఠూరంగా మాట్లాడుతున్నారు. కాసేపు జీతం లెక్కచెప్పమంటారు. డబ్బు ఎవరికో ఇస్తున్నానంటారు. ఒక రోజు నా ఖర్చు ఎక్కువైతోందంటారు. తిరిగి చెడుతున్నాననంటారు. ఇంకా...పచ్చిగా ఎవరైనా వున్నారా? లేకపోతే నన్నెందుకు ఎవాయిడ్ చేస్తున్నావంటారు? మీ పద్ధతి శృతి మించుతోంది. నేనూ మనిషినే. ఎంతకని భరించగలను?''

'......'

''ఏంటీ భరించలేకపోతే నా దారి నేనుచూసుకోవచ్చా. ఎలా మాట్లాడుతున్నారు. సర్లెండి తర్వాత మాట్లాడుకుందాం'' ఆమె ఫోన్‌ని ఆఫ్ చేసింది.

బస్సు చాదర్‌ఘాట్ దాటింది. బస్ కిటకిటలాడుతోంది. ప్రయాణీకులు బుట్టలో కుక్కిన ఏకుల కట్టల్లా నిలబడి వేలాడుతున్నారు. విండో సీట్లో కూర్చున్నా వాతావరణం ఇరుగ్గా వుంది నాకు. ఆమె మాటలు నాలో ఏవేవో ఆలోచనలన్నీ, ఊహల్నీ ప్రోదిచేస్తున్నాయి. పక్కచూపుల్తో ఆమె వైపు చూశాను. బెంగాలీ కాటన్ చీరె. శుభ్రమైన మనిషిగా కట్టూబొట్టూ వేషధారణ పొందికగా వున్నాయి.,

నడివయసు ఛాయ, చెంపల జీరలాడే జుట్టు, మనసు పెనం మీద వేగుతున్న వ్యధ పైకి మొహం మీద పారాడుతోంది.

మళ్లీ...'సారే జ హాం సే అచ్ఛా'

నాకు తెలీకుండానే నాలో... ఈ సారి ఈమె మాట్లాడితే ఏమవుతుందో? ఆమె భర్త ఏమైనా నిర్ణయాన్ని ప్రకటిస్తాడేమో; దారం తెగుతుందేమో? వంటి బెరుకు, భయం పొడసూపినై. అసలు వీళ్లిద్దరి సమస్యా ఏమిటో?!

ఆమె బాగా సన్నగా మాట్లాడుతోంది. ''మిమ్మల్ని సంతోషపెట్టడమే నాకిష్టం లేదా? మీ కోరికలసలు పట్టవా నాకు? ఇంతకీ ఏమిటీ మీ వాదన? నేను బస్సులో వున్నానండీ. దయచేసి ఫోన్ చెయ్యకండి. రాత్రికి మాట్లాడుకుందాం. ఆఫీసుకి బయల్దేరుతున్నారా?'' ఆ స్వరం మరీ తగ్గించి ప్రాధేయపూర్వకంగా అంటోంది.

'......'

''ఏమిటీ? ఆ వొక్క పద్ధతిలో వుంటున్నానా? సర్లెండి టిఫిన్ చేశారా? లేదా? ''

బస్‌లో ఎవరిగొడవలో వాళ్లున్నారనుకున్నా. ఉత్సుకతతో ఈ మాటలు వింటున్న వాళ్లు లేకపోలేదు.

''ఏమిటి? ఆర్టిఫిషియల్ ఎంక్వయిరీలు వద్దా...సర్లెండి... ఏమిటీ? పిల్లలిద్దర్నీ హాస్టల్‌లో వేయించాలా? లేకపోతే వీళ్లని ఆఖరి దానితో పాటు మా అమ్మా వాళ్లింట్లోనే వుంచాలా? ఏమంటున్నారు మీరు పూర్తిగా బుర్ర ఖరాబయినట్లుంది. కౌన్సిలింగ్ ఈ పరిస్థితుల్లో మీకు చాలా అవసరమనిపిస్తోంది.''

'టికెట్...టికెట్...ముందుకు జరగండి...ముందుకు జరగండి' కండక్టర్ పిలుపులతో జనంలో తోపిడి మొదలయింది.

''ఆం...వస్తున్నానురా... ఒక్క అయిదునిమిసాలు వెయిట్ చెయ్యి. నెక్స్ట్ స్టాపులోనే దిగుతున్నాను. దగ్గరకొచ్చేశానులే''

ఈ హడావుడిలో రకరకాల మాటల సందడిలో నేనూ కొంచెం పరాకులో పడ్డాను. ఆ తర్వాత ఆమె మాటల్ని మిస్ అయ్యాను.

సెల్ ఫోన్ల ద్వారా వినవస్తున్న కలగాపులగపు సంభాషణలు ఆలోచనాత్మకంగా వున్నాయి. అసలే నన్ను 'బుద్ధి



'నవ్య'లో
ఇటీవల ముగిసిన
'గురూ... జగద్గురూ'
సీరియల్ రచయిత్రి
రమ గమిని పరిచయం

పేరు : రమ గమిని
అభిరుచులు: సంగీతం,
సాహిత్యం


'మరిమరి నిన్నే మరువకనే'' సీరియల్‌తో నవ్య పాఠకులకి పరిచయం అయ్యాను. 'గురూ... జగద్గురూ' నవ్యలో నా రెండవ సీరియల్.

పత్రికా రంగంలో ప్రత్యేకమైన బాణి, నిర్దుష్టమైన ఎంపిక, మనోరంజకమైన అంశాలు, ఎథిక్స్‌కి పెట్టిందిపేరు అయిన 'నవ్య' నాకిచ్చిన ప్రోత్సాహానికి మరోసారి నా కృతజ్ఞతలు.

పత్రికాముఖంగా, పర్సనల్‌గా 'గురూ... జగద్గురూ'ను గురించి తమ అభిప్రాయాలు తెలియజేసిన అందరికీ అభినందనలు.

మీ
**రమ గమిని**


అడ్రస్:
ప్లాట్ నెం.122
బృందావనం కాలనీ,
జి.కె.కాలనీ వెనుక,
నేరేడ్‌మెట్ క్రాస్‌రోడ్స్,
హైదరాబాద్-94.




జీవి' అంటుంది నా శ్రీమతి.

బస్సు ఆబిడ్స్ చేరింది.

ఆమె సీట్లో సర్దుకు కూర్చుంది. నాపైపొకసారి అదోలా చూసింది. తను ఫోన్లో మాట్లాడిన మాటలు నేను వినివుంటానా? అన్న అనుమానం తొంగి ఘూసిందాచూపులో. తాను ఉతికి ఆరేసుకున్న వస్త్రమే అయినా అందరికీ కనిపించే పెరట్లో కదా దాన్ని వేసింది. పదిమంది దృష్టికీ రాదా మరి!

''రామిరెడ్డిగారేనా? నమస్కారం సార్. రామకృష్ణగారు మీతో కన్సల్ట్ అవమన్నారు. నా పేరు డయానా సార్''

నా ఆలోచల్ని తుంచుతూ మాటలు వినిపిస్తున్న పక్కకి చూశాను. నాకు కుడివైపు స్త్రీల వరుసల్లో నుంచీ ఈ డయా...

''మిమ్మల్ని పర్సనల్‌గా కలుసుకోవడానికి వీలుండదని ఫోన్‌లో చెప్పమన్నారు సర్. ఏమనుకోవద్దు సర్. నా ప్రాబ్లెమ్...నేను ఇసిఎమ్‌లో చేస్తున్నాను సర్. వాడు అదే ఆ శ్రీధర్... చాలా హారిబుల్‌గా నన్ను ట్రాప్ చేశాడు సర్. నా క్రెడిట్ కార్డ్ ఎకౌంట్‌లో తేడా వస్తే చూసి సరిచేయిస్తానని నమ్మబలికి కార్డు తీసుకుపోయాడు సర్. వాడెవడో నాకు తెలీదు సార్. మా ఫ్రెండ్ కోసం అప్పుడప్పుడూ వస్తుండేవాడు. అంతే పరిచయం సార్. నా క్రెడిట్ కార్డుని ఫోర్జరీ చేసి పాతికవేలు డ్రా చేశాడు. వాడితో మాట్లాడుదామని ఫోన్ చేస్తే అన్నీ తప్పు నెంబర్లు సర్. వాడిచ్చిన ఫోన్ నెంబర్లు, అడ్రస్సు అన్నీ ఫేక్. ఎక్కడినుంచి చేస్తున్నాడో గానీ ఫోన్లలో చాలా డర్టీగా మాట్లాడుతున్నాడు సర్.'' ఆమె ఏడుస్తోంది.

''ఎవర్ని సలహా అడిగినా కార్డు క్యాన్సిల్ చేశావు కదా. ఇంక వదిలెయ్'' అంటున్నారు సర్. కానీ వాడి ఫోన్లెట్లా సర్. ఆఫీసుకో, నా హాస్టల్‌కో చేస్తున్నాడు. వాడి బాధలు భరించలేక సెల్ మార్చుకొన్నాను...

''సారీ సర్...మిమ్మల్ని ట్రబుల్ చేస్తున్నాను. నాకఅమ్మా, నాన్న, బ్రదర్స్, సిస్టర్స్ ఎవరూ లేరు.మా చిన్నాన్న చదివించారు నన్ను. వాళ్ళు పల్లెలో వుంటారు. వాళ్లకిలాంటివి ఏమీ తెలీవు సర్. వీడి కోసం హాస్టల్ కూడా మారుతున్నాను సర్. కానీ ఉద్యోగం మారాలంటే కష్టం కదా సార్''

''..........''

''మీరు రెండు ఉపకారాలు చేసి పెట్టాలి సర్. వాడిని పట్టుకోవడం ఒకటి. బ్యాంక్ వాళ్లతో మాట్లాడి మినిమమ్ కట్టేటట్లు ఎకౌంట్‌ని సెటిల్ చేయించాలి సర్. లేకపోతే నాలుగువేల జీతంలో అంత మొత్తం నావల్లేమవుతుంది సర్. నేను మీ అమ్మాయిననుకొని హెల్ప్ చెయ్యండి సర్''

సడెన్‌బ్రేక్‌తో బస్సు ఆగింది. డ్రైవరు అరుస్తున్నాడు. సైకిల్ వాలా ఒకడు అంత ట్రాఫిక్‌లోనూ బస్సును దాటి పోవాలని అడ్డం వచ్చాడు. బస్సు తగిలి కిందపడ్డాడు. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడం వలన బతికాడు. బస్సు ముందుకి పడ్డాడు కనుక బతికాడు. అదే పక్కకి పడుంటే ఏమయ్యేవాడో. బస్సు కింద పడ్డవాడు లేచి దులుపుకొని సైకిల్ తీసుకొని ఉడాయించాడు. లేచి నిలబడి మాట్లాడుతున్న వాళ్లంతా బస్సు కదిలేసరికి సీట్లలోకి సర్దుకున్నారు. బస్సు ఆగిన టైములో కొందరు ఎక్కేశారు.

''నన్ను మీరే రక్షించాలి సర్...అలాగే సర్... థ్యాంక్స్ సర్...థ్యాంక్స్ సర్...అట్లాగే సర్... మీ సహాయం మరిచిపోలేను. థ్యాంక్స్‌సర్....'' ఏడుపు గొంతుతో ఫోన్ ఆఫ్ చేసింది డయానా. మధ్యన జనం నిలబడి వుండడంతో ఆమె కనపడలేదు.

బస్సు నిమ్స్ చేరింది. దిగేవాళ్లు, ఎక్కేవాళ్లు... బస్సు మాత్రం ఖాళీ లేకుండా నిండిపోయింది. బస్సులాగే నా మనసు కూడా భారమైన ఆలోచనలతో సతమతమవడం మొదలుపెట్టింది. ఎవరికీ చెప్పుకోలేని గోడుతో, సుఖశాంతులు కరవై... ఏమిటీ జీవితాలు?

జీవనవిధానం మారుతోంది. ఆధునికత తెచ్చిన సాంకేతిక పరిణామాలు జీవితాలను అపారంగా వృద్ధి చేస్తున్నాయి అంటున్నారు. కానీ, పూసల్లో దారం లాంటి విశ్వాసం ఏది? చెమర్చిన కళ్లను తుడిచి సేదదీర్చే అమృతహస్తాలేవి? ఏ ఇంటి రామయణాన్ని స్పర్శించినా సీత కథ వెత అన్న వాస్తవమే మొహాన్ని ఛెళ్లుమనిపిస్తుందా?

వున్న సమస్యలు కొన్ని అయితే తెచ్చిపెట్టుకునేవే మరిన్ని అయి మనిషి చింతలతో, చికాకులతో మనుగడని సాగించడం ఎంత కష్టమో కదా అనిపించింది నాకు. నా మేథస్సులో ఏవేవో ప్రశ్నలు. సమాధానం తెలీని ప్రశ్నలు. నా ఆలోచనల్లో నేనుండగానే మైత్రీవనం వచ్చింది. నేను బస్సు దిగాను. వాళ్లంతా ఇంకా చాలా దూరం వెళ్లాల్సి వుంది. మళ్లీ బస్సు నిండింది. నా పక్కన కూర్చున్న ఆవిడ విండో దగ్గరికి జరిగింది. బస్సు బయలుదేరింది.

'సారే జహాఁ సే అచ్ఛా....'

ఫోన్ రింగవుతున్న శబ్దం బస్సు మోతతో కలిసిపోయి గాలిలో తేలిపోయింది.

'ప్చ్'... నాకు తెలీకుండానే విరక్తితో కూడిన శబ్దం నా పెదాలపై నుంచీ వచ్చింది. వెళుతున్న బస్సు వైపుచూస్తూ ముందుకి నడిచాను. నా గమ్యాన్ని నేను చేరుకోవాలి కదా మరి!

★